క్లుప్తంగా

'కుటుంబ భరోసా' చెక్కు అందజేత



తరిగొప్పుల: ఫొటోగ్రఫీ కుటుంబ భరోసా పథకం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కే హుస్సేన్ అన్నారు. మండలకేంద్రానికి చెందిన జంగ వీరయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా, అసోసియేషన్ మండల అధ్యక్షుడు నాం శ్రీనివాస్ ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో హుస్సేన్ ముఖ్యఅతిథిగా పాల్గొని కుటుంబ భరోసా పథకంలో భాగంగా రూ.1,45,000 చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. రాష్ట్ర బాధ్యులు శైలేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ప్రకాశ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నర్మెట: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్సై గైకాడి అనిల్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా మండలంలోని మచ్చుపహాడ్‌లో మద్యం విక్రయిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న బెల్ట్‌షాపుపై దాడిచేసి మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు నిర్వాహకులు గొల్లపల్లి ఆంజనేయులు, రాజశేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సమయపాలన పాటించని వైద్యులపై చర్య తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ వెస్ట్ నియోజకవర్గ ఎల్‌డీఎం ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సతీష్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యులు లేకపోవడం, ఖాళీ కుర్చీలు ఉండటాన్ని గమనించి వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పార్టీ నాయకులు మేకల మల్లేశం, కోల శ్రీనివాస్, గుర్రం సోమయ్య, జంపాల శ్రీనివాస్ ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ముదిరాజ్, మైనార్టీలు



స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన ముదిరాజ్, మైనార్టీ సంఘాల పెద్దలు ఆదివారం హనుమకొండలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముదిరాజ్ కమ్యూనిటీ భవనం, ముస్లిం మైనార్టీలకు సంబంధించిన ఈద్గాకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కడియంను కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. తన సీడీఎఫ్ నిధుల నుంచి ముదిరాజ్ కమ్యూనిటీ భవనానికి రూ.10లక్షలు, ఈద్గాకు ప్రహరీ కోసం రూ.10లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే జఫర్‌గఢ్ మండలంలోని జఫర్‌గఢ్, హిమ్మత్‌నగర్, గువ్వలగూడేనికి చెందిన ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్సీ కడియంను కలిసి ముదిరాజ్ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆయన స్పందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.20లక్షల నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

రెడ్డి సంఘం గ్రామ కమిటీ

బచ్చన్నపేట: మండలంలోని ఆలింపూర్ గ్రామ రెడ్డి సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా స్థానిక సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పోరెడ్డి గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తొగిటి బాల్‌రెడ్డి, కోశాధికారి గంట తిరుమల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు దండ్యాల పెద్ద జనార్దన్‌రెడ్డి, సభ్యులుగా చిర్ర తిరుపతిరెడ్డి, పాతూరి యాదిరెడ్డి, వంగపల్లి గోపాల్‌రెడ్డి, పెద్దపాటి గాల్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, జయపాల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు పాల్గొన్నారు.

నీటి శుద్ధీకరణ

చిల్పూరు: ఇటీవల కురిసిన వర్షాలతో బోర్లు, బావుల్లోకి కొత్త నీరు వచ్చి చేరింది. దీంతో ఆదివారం మండలంలోని వంగాలపల్లిలో సర్పంచ్ అరూరి ప్రణిత నీటి శుద్ధి కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా తాగునీటి బావులు, బోర్లలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ఆర్థికసాయం

జఫర్‌గఢ్: వడ్డెగూడెం గ్రామానికి చెందిన బండ్ల శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కాగా, విషయం తెలుసుకున్న 1997–98 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్నేహితుడికి రూ.25 వేల ఆర్థికసాయం ఆదివారం అందజేశారు.

రూ.43 లక్షలు నీళ్లపాలు

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన కాజ్‌వే
- 4 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- బ్రిడ్జి నిర్మించాలంటూ వేడుకుంటున్న స్థానికులు, వాహనదారులు



మండలగూడెం కాజ్‌వే వద్ద తెగిన రోడ్డు

రఘునాథపల్లి: మండలగూడెం వాగు వద్ద రూ.43 లక్షలతో కాజ్‌వే నిర్మించినా అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రయోజనం లేకుండా పోయింది. ఎగువ నుంచి వచ్చే వరద ఎంత.. కాజ్‌వే సామర్థ్యం ఏమేరకు ఉండాలనే కనీస విషయాలను పరిగణలోకి తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. మూడు నెలల క్రితం కాంట్రాక్టర్ కాజ్‌వే పనులు చేపట్టి కేవలం ఎనిమిది పైపులు మాత్రమే వేసి ఇరువైపులా 10 మీటర్లతో ప్రొటెక్షన్ వాల్ నిర్మించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రవాహం వెళ్లే దారిలేక ఓ వైపు రోడ్డు పూర్తిగా తెగింది. ప్రత్యామ్నాయంగా అధికారులు మొరంతో వేసిన రోడ్డు గురువారం కురిసిన భారీ వర్షంతో కాజ్‌వే వద్ద మళ్లీ తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. వ్యవసాయబావుల వద్దకు, అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లలేని దుస్థితి నెలకొంది.

అదనపు దూరం..

మండలగూడెం నుంచి లక్కపాక్కలతండా మీదుగా జనగామకు 12 కిలోమీటర్లు ఉంది. ఖిలాషాపూర్ నుంచి రఘునాథపల్లి మీదుగా ప్రయాణిస్తే అదనంగా 21 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. వాగు ఉధృతికి కాజ్‌వే వద్ద రోడ్డు తెగిన సందర్భంగా పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాజయ్యను.. బ్రిడ్జి కావాలంటే కాజ్‌వే ఎందుకు మంజూరు చేశారంటూ ప్రజలు నిలదీశారు. బ్రిడ్జి నిర్మిస్తేనే ఓట్లు వేస్తామని తేల్చి చెప్పగా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి హైలెవల్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఎమ్మెల్యే మాట నిలబెట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తెగిన రోడ్డు వద్ద వాగులోంచి వెళ్తున్న గీత కార్మికులు

హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి



చిన్నపాటి కాజ్‌వే నిర్మించడంతో వరద ప్రవాహానికి రెండుసార్లు కోతకు గురై నాలుగు గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు వ్యవసాయబావుల వద్దకు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. శాశ్వత పరిష్కారం కోసం హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి.

- ఉత్తెపు ఉమారాణి, సర్పంచ్, మండలగూడెం

రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం



మండలగూడెం వాగు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే రాజయ్య ఆదేశాల మేరకు రూ.6.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధులు మంజూరవుతాయని భావిస్తున్నాం.

- టీకే.సతీష్, ఏఈ పీఆర్, రఘునాథపల్లి

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న కృష్ణ

జఫర్‌గఢ్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపాన రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుమ్మ చెట్లను తన సొంత ఖర్చులతో పొక్లెయినర్ సాయంతో తొలగించే కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం గ్రామ శివారులో కోతకు గురైన కల్వర్టును పార్టీ బృందంతో కలిసి పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలకు పలు గ్రామాలకు వెళ్లే రహదారులు దెబ్బతినడంతో పాటు కల్వర్టులు కోతకు గురై ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. సదయ్యగౌడ్, డాక్టర్ సోమనారాయణ, నర్సింహారెడ్డి, అబీబ్‌ఖాన్, శీనయ్య, యాదగిరి, దుద్దుల కొంరెల్లి, బోరిగం కొంరెల్లి, సోమయ్య పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని సర్వే నంబర్ 627లోని సైదవారి కుంట శిఖం ప్రభుత్వ భూమిలో కొందరు అధికార బీఆర్‌ఎస్ పార్టీ నేతల అండతో చేస్తున్న అక్రమ కట్టడాలను రెవెన్యూ సిబ్బంది ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ రవీందర్ మాట్లాడుతూ సైదవారి కుంట ప్రభుత్వ శిఖం భూమిలో కొందరు అక్రమంగా కట్టడాలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో తహసీల్దార్ పూల్ సింగ్‌చౌహాన్ ఆదేశాల మేరకు సదరు కట్టడాలను తొలగించినట్లు తెలిపారు. దాదాపు 300 గజాల స్థలాన్ని ఆక్రమించి దాని చుట్టూ ఫెన్సింగ్ చేసి పిల్లర్లతో ఇంటి నిర్మాణం చేస్తుండగా దానిని కూల్చివేయించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ఎవరూ ఎలాంటి కట్టడాలు చేయవద్దని, నిబంధనలకు ఉల్లంఘిస్తే ఎంతటివారైనా తగిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ శివ పాల్గొన్నారు.

నేటి నుంచి పశు వైద్యశిబిరాలు

లింగాలఘణపురం: మండలంలో నేటి నుంచి ఆగస్టు 30 వరకు అన్ని గ్రామాల్లో గాలికుంటు, లంపీవైరస్ వ్యాధి నిరోధక టీకాలతో పాటు నట్టల నివారణ మందులు కూడా వేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి అనిత తెలిపారు. ఈనెల 31 నుంచి ఆగస్టు 2 వరకు జీడికల్, 3 వరకు వడిచర్ల, 3 నుంచి 5 వరకు గుమ్మడవెల్లి, 4 నుంచి 6 వరకు వనపర్తి, 7 నుంచి 9 వరకు చీటూరు, 8 నుంచి 14 వరకు కుందారం, 12 నుంచి 14 వరకు లింగాలఘణపురం, 15 నుంచి 16 వరకు నాగారం, 16 నుంచి 17 కొత్తపల్లి, 17 నుంచి 19 క్లాం, 18 నుంచి 22 వరకు నేలపోగుల, 21 నుంచి 23 వరకు సిరిపురం, 24 నుంచి 26 వరకు మాణిక్యాపురం, 28 నుంచి 30 వరకు నెల్లుట్లలో పశువైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను నేటి (సోమవారం) నుంచి వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి రామారావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు బచ్చన్నపేటలో, 3, 4న చిన్న రామన్‌చర్ల, ఆలింపూర్, 5, 14 న తమ్మడపల్లిలో, 7, 8న కట్కూర్, పుల్లగూడ, మన్సాన్‌పల్లిలో, 9,10న గంగాపూర్, సాల్వాపూర్, బండనాగారం, నారాయణపూర్‌లో, 11,12న కేసిరెడ్డిపల్లి ఇటుకాలపల్లిలో, 16,17న లక్ష్మాపూర్‌లో, 16,19న పోచన్నపేటలో, 18, 19న కొడవటూర్‌లో, 31, 2న పడమటికేశ్వాపూర్, లింగంపల్లిలో, 3, 5న నాగిరెడ్డిపల్లి, దబ్బగుంటపల్లి, 18, 22న కొన్నెలో పశువులకు టీకాలను వేయనున్నట్లు తెలిపారు.

కేసీఆర్ పాలనలోనే తండాలకు మహర్దశ



రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నర్మెట: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే గిరిజన తండాలు పంచాయతీలుగా ఏర్పడి మహర్దశ కలిగిందని ఎంపీపీ తేజావత్ గోవర్దన్ అన్నారు. మండలంలోని ఆగాపేట-రత్నతండా రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో మండల పరిషత్ నిధులతో కల్వర్టు నిర్మాణం, తన సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘనవిజయం సాధించి ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తాడని ఆయన తెలిపారు. జెడ్పీ కోఆప్షన్ ఎండి గౌస్, సర్పంచ్ నీరటి రాణి సుధాకర్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ బాపురావును సస్పెండ్ చేయాలి



జనగామ రూరల్: ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును భారతీయ జనతా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఎంపీ సోయం బాపురావు వ్యాఖ్యలకు నిరసనగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల జనాభా కలిగిన లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని లేదంటే మరో మణిపూర్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న సోయం బాపురావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏబీఎస్ఎస్ వాసు నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ స్వామి నాయక్, కౌన్సిలర్ అనిత నాయక్ ఉన్నారు.

నర్మెట: లంబాడిలను ఎస్టీ జాబితానుంచి తొలగించాలని, మణిపూర్ తరహాలో పోరాటాలు చేస్తామని మాట్లాడిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును వెంటనే సస్పెండ్ చేయాలని మండల సేవాలాల్ సేన అధ్యక్షుడు ధరావత్ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపురావు వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు స్పందించాలని అన్నారు. నరేష్, బాలు, లక్ష్మణ్, మహేందర్, హుస్సేన్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వినూత్న నిరసన



జఫర్‌గఢ్: వినూత్న నిరసన తెలుపుతున్న కార్మికులు



బచ్చన్నపేట: వంటావార్పు చేస్తున్న కార్మికులు

జఫర్‌గఢ్: సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ మండల కేంద్రంలో కార్మికులు సమ్మె శిబిరం వద్ద సాష్టాంగ నమస్కారాలతో వినూత్న రీతిలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని గత 25 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడం దారుణమన్నారు. క్రాంతికుమార్, వివేక్‌సింగ్, మధు, భిక్షపతి, రబ్బాని పాల్గొన్నారు.

25వ రోజుకు చేరిన జీపీ కార్మికుల సమ్మె

తరిగొప్పుల: జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రభుత్వ వైఖరికి నిరసనగా సాష్టాంగ నమస్కారం తెలుపుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. సాంబారి కృష్ణమూర్తి, నాగపూరి సతీష్ పాల్గొన్నారు.

ఉరి తాడు బిగించుకొని కార్మికుల నిరసన

కొడకండ్ల: గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఉరి తాడు బిగించుకొని నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి నూనెముంతల యాకన్న, అయిలయ్య, శ్రీనివాసచారి, ఎల్లమ్మ, సోమయ్య, ధర్మనాయక్, మంజ్యానాయక్‌తోపాటు కార్మికులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

రఘునాథపల్లి: దుర్భర జీవితాలు గడుపుతున్న పంచాయతీ కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర అంబేడ్కర్ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఓరుగల్లు ఎల్లన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్లన్నతో పాటు వెలుగు బూత్‌సొసైటీ గండికోట రవీందర్, రంజిత్, పల్లపు మురళి కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. రాజేష్, సత్యనారాయణ, భిక్షపతి, రాజయ్య పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో వంటా వార్పు

బచ్చన్నపేట: తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ సిబ్బంది నిరవధిక సమ్మెను చేపట్టారు. సమ్మెలో భాగంగా ఆదివారం వంటావార్పుతో నిరసన తెలిపారు. ప్రభాకర్, లలిత, మురళి, శ్రీనివాస్, రాజు, బాబు పాల్గొన్నారు.

ప్రహరీని ఢీకొన్న లారీ

దేవరుప్పుల: ఓ లారీ.. అదుపు తప్పి ఇంటి ప్రహరీని ఢీకొంది. ఈ ఘటన ఆదివారం మండలంలోని దేవరుప్పుల– మన్‌పహాడ్– సూర్యాపేట ప్రధాన రహదారిపై జరిగింది. జనగామ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న లారీ అదుపు తప్పి చీకటి యాదగిరి ఇంటి ప్రహరీని ఢీకొంది.

ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నర్మెట: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

నర్మెట: కులమతాలు వద్దు శాంతి స్థాపనే ముద్దు.. క్రైస్తవ సోదరులపై, మహిళలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలను వెంటనే అరికట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని పాస్టర్ రెవరెండ్ ఎస్. దేవదానం అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా ఆదివారం మండలకేంద్రంలో తెలుగు బాప్టిస్టు చర్చి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీనుద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రిస్టియన్లకు రక్షణ కల్పించాలని అన్నారు. ర్యాలీలో సంఘం అధ్యక్షుడు ఎనుగుల రాజు, ఎనుగుల వెలంగిణి, చుంచు శోభన్‌బాబు, గడ్డం సురేష్, గద్దల కిశోర్, ఎనుగుల ఉదయ్, గడిపె ప్రభాకర్, కొలిపాక సుధాకర్, గాదర ప్రభాకర్ పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

జఫర్‌గఢ్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తమ్మడపల్లి (ఐ)లో క్రైస్తవులు ఆదివారం శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మణిపూర్ ఘటనలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మణిపూర్‌లో తక్షణమే శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులుఅనందం, భాస్కర్, అదాం, ఆనందం, దేవదాను, యాకలక్ష్మి, నిర్మల, శౌరి పాల్గొన్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే



జనగామ రూరల్: పట్టణంలోని బాణాపురం కాలనికి చెందిన కుమ్మర సంఘం నాయకుడు కొయ్యడ రాజు గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, ఆదివారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రఘునాథపల్లి: మండలంలోని వెల్దిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వెల్దికి చేరుకొని బాధిత కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఇటీవల తాటిచెట్టుపైనుంచి పడి తీవ్ర గాయాలపాలైన గీత కార్మికుడు తౌలుపునూరి యాదగిరిగౌడ్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

గండిరామారంలో..

నర్మెట: మండలంలోని గండిరామారానికి చెందిన తుప్పుడు సమ్మయ్య (60) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆదివారం బాధిత కుటంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. గద్దల నర్సింగా రావు, సర్పంచ్ స్వేతా కిషన్, సురేష్, రాజు తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేట: సాల్వాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, సీపీఎం సీనియర్ నాయకుడు బండకింది బాల్‌నారాయణ భార్య బాలమణి మృతి చెందగా పలువురు నాయకులు పరామర్శించారు. ఆదివారం మృతురాలి పార్థివదేహంపై పూలమాలల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటేష్, ఎల్లయ్య, రాములు, నర్సయ్య, రాములు, సమ్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నివాళి

పాలకుర్తి: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత చాపల మహిపాల్ రెడ్డి(60) గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, మృతదేహాన్ని ఎర్రబెల్లి ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదేవి ఆదివారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యుత్ సఫరా పునరుద్ధరణ

చిల్పూరు: సబ్‌స్టేషన్ల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ దేవాదుల రిజర్వాయర్ మీదుగా వివిధ గ్రామాలకు కరెంట్ వెళ్లేందుకు విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. కాగా, భారీ వర్షాలకు కొన్ని పోల్లు వంగి పోగా, మరికొన్నింటి జంపర్లు కట్ కావడంతో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వాటిని సరి చేసేందుకు చిల్పూరు జేఎల్‌ఎం బాషబోయిన అశోక్, కట్టర్ చెరిపెల్లి సురేష్ రెండురోజులపాటు శ్రమించి స్తంభాలను సరిచేశారు. దీంతో ఆదివారం అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కాగా, సాహసం చేసి విధులు నిర్వర్తించిన అశోక్, సురేష్‌లను పలువురు అభినందించారు.

సీఐకి సన్మానం

చిల్పూరు: రఘునాథపల్లి సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డిని ఆదివారం సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, మండల రైతు కోఆర్డినేటర్ జనగాం యాదగిరి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు దామోదర్, మాజీ ఎంపీటీసీ సంపత్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారం పోలీస్ శాఖకు ఉండాలని అన్నారు.

ఎస్సైని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

జఫర్‌గఢ్: ఇటీవల ఎస్సైగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహేందర్‌ను మాజీ సర్పంచ్ తాటికాయల బాబు పార్టీ బృందంతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నియామకం

జనగామ రూరల్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కొమ్మూరి యువసేన మండల కమిటీని ప్రతాప్ రెడ్డి నియమించారు. మండల అధ్యక్షుడుగా ఒక్క ప్రవర్దన్, ఉపాధ్యక్షుడుగా గాజుల రాజు నియామకమయ్యారు. అనంతరం వారికి కొమ్మూరి నియామక పత్రాలను అందజేశారు.

వాహనాల తనిఖీ

దేవరుప్పుల: దేవరుప్పుల మండల కేంద్రంలో ఎస్సై శ్రావన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆర్సీలు, కాలుష్య నిర్ధారణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు.

ఆలయంలో చోరీ

జనగామ రూరల్: ఎల్లంలలో బండమీద ఉన్న శ్రీరామలింగేశ్వరాలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం రాత్రి దొంగలు హుండీలోని నగదు, వెండి నేత్రాలు ఎత్తుకెళ్లారు. దుండగులను వెంటనే పట్టుకొని దేవాలయ రక్షణకు పాటుపడాలని గ్రామస్తులు కోరారు.

అంగడిలో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న రమేష్

చిల్పూరు: చిల్పూరుగుట్ట అంగడిలో సౌకర్యాలు కల్పించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగడిల సర్వేలో భాగంగా ఆదివారం చిల్పూరుగుట్ట అంగడిని మండల సర్వే బృందం సభ్యులు సందర్శించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ చిల్పూరుగుట్ట అంగడి 1956 నుంచి నిర్వహిస్తున్నారని చెప్పారు. అంగడికి ప్రతీ ఆదివారం ఎంతో ఆదాయం వస్తున్నా అభివృద్ధి శూన్యం అన్నారు. వర్షాలకు, ఎండలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సభ్యులు సాదం రమేష్, మేకల మల్లేషం, బోల్ల రాజ్‌కుమార్, ఆవుల ప్రభాకర్‌లు, మత్కాపూర్, శ్రీపతిపల్లి సొసైటీ అధ్యక్షుడు కొంరయ్య, ఆసరి రాజయ్య, నాగరాజు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి పాటుపడాలి



చిల్పూరు: ప్రజలకు న్యాయమైన పాలన అందాలంటే బహుజన సమాజ్‌వాది పార్టీకే సాధ్యమని, అందుకు మండలంలో బీఎస్పీ బలోపేతం కోసం పాటు పడాలని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తాళ్లపల్లి వెంకటస్వామి, అధ్యక్షుడు మోకినపల్లి చక్రపాణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మండల ఇన్‌చార్జ్ నల్ల రమేష్ అధ్యక్షతన నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడుగా స్వర్గం స్టీవెన్, ఉపాధ్యక్షుడిగా మోతి కొంరయ్య, ప్రధాన కార్యదర్శిగా చెరిపెల్లి అనీల్, కోశాధికారిగా కనకం అశోక్, భరత్, మత్యాల కుమార్, పాశం సందీప్ ఎన్నికయ్యారు. జలగం ప్రవీణ్, అరుణ్, రఫీ, అఖిల్, దార సందీప్, విజయ్ పాల్గొన్నారు.